

ఆస్పత్రి ఆవరణలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తన సమస్యను వివరిస్తున్న మహిళ

# మహమూద్ అలీని పరామర్శించిన కేటీఆర్

అబిడ్స్ మే 26: రాష్ట్ర మాజీ హోంమంత్రి మహమూద్ అలీని.. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ అబిడ్స్ చాపల్ రోడ్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహమూద్ అలీని సోమవారం కేటీఆర్ పరామర్శించారు. వైద్యులతో మహమూద్ అలీ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మహమూద్ అలీ కుమారుడు ఆజం అలీ, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆనంద్ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎంకే బద్రుద్దీన్, మహిళా నాయకురాలు ప్రియా గుప్తా, జాంబాగ్ డివిజన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు అహ్మద్, నాయకులు.. ప్రదీప్, టంపు, శైలేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మీరే రావాలి సార్..

చాపల్ రోడ్‌లోని దవాఖానాలో చికిత్స పొందుతున్న మహమూద్ అలీని పరామర్శించేందుకు వచ్చిన కేటీఆర్ పట్ల ప్రజలు విశేష ఆదరణ కనబరిచారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులను ఆత్మీయంగా పలకరించగా.. కేటీఆర్ సార్ మళ్లీ మీరే రావాలి అని తమ అభిమానాన్ని చాటుకున్నారు.బీఆర్ఎస్ హయాంలోనే తాము సంతోషంగా ఉండేవారమని, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ సంక్షేమం మరిచిందని తెలిపారు. అదేవిధంగా ఓ మహిళ దవాఖానలో తనకు అయిన బిల్లును తన ఆర్థిక పరిస్థితి దృష్ట్యా భరించలేనని చెప్పగా యాజమాన్యంతో మాట్లాడి బిల్లు తగ్గించేలా చూస్తానని కేటీఆర్ ఆమెకు హామీ ఇచ్చారు.

# మిస్ తెలుగు యూఎస్ఏ రన్నరప్‌గా చూర్ణిక




కాప్రా, మే 26: అమెరికాలో జరిగిన మిస్ తెలుగు యూఎస్ఏ-2025 పోటీల్లో కాప్రా ఏఎస్‌రావు నగర్‌లోని భవానీనగర్‌కు చెందిన చూర్ణికా కొత్తపల్లి రన్నర్ అప్‌గా నిలిచింది. ఏప్రిల్‌లో ఫైనల్ పోటీలకు ఎంపికైన చూర్ణిక డల్లాస్‌లో ఆదివారం రాత్రి (భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 11.30 గంటలకు) నిర్వహించిన టైటిల్ పోటీల్లో రన్నర్ అప్‌గా (ద్వితీయ స్థానం) నిలిచింది. దీనికి తోడు పీపుల్స్ ఛాయిస్ అవార్డును గెలుచుకొని రెండు కిరీటాలను సొంతం చేసుకొన్న చూర్ణిక కొత్తపల్లిని.. ఆయన తండ్రి కొత్తపల్లి రాంబాబు (బిల్డర్, లయన్స్ క్లబ్ ప్రతినిధి), కుటుంబ సభ్యులకు యూఎస్ఏలోని తెలుగువారితో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా చూర్ణిక తండ్రి కొత్తపల్లి రాంబాబు మాట్లాడుతూ.. టైటిల్ పోటీల్లో తుదివరకు పోరాడిన తన కూతురు రన్నర్‌అప్‌గా నిలువడం సంతోషంగా ఉందని అన్నారు. కృషి, ప్రతిభ, ధైర్యంతో పాటు రెండు రాష్ట్రాల అభిమానుల మద్దతుతో ద్వితీయస్థానం (రన్నర్ అప్) సాధించడంతో పాటు, పీపుల్స్ ఛాయిస్‌లో విజయం సాధించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. తన కూతురుకు ఓటుతో మద్దతు తెలిపిన వారందరికీ రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. చూర్ణిక ప్రస్తుతం ఫ్లోరిడాలో ఎంఎస్ చదువుతోంది.

# బకాయిలు చెల్లిస్తేనే!

(మొదటిపేజీ తరువాయి)

వీరే తీసుకొచ్చి మరీ రోగి ప్రాణాలు కాపాడిన దాఖలాలున్నాయి.

### వైద్యారోగ్యశాఖ మంత్రి స్పందనేదీ?

పేరున్న పెద్దాసుపత్రుల్లో మెటిరియల్ నిలిచిపోతుంటే మరోవైపు వైద్యారోగ్యశాఖ మంత్రి స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. తమ సమస్యను పరిష్కరించి బకాయిలు చెల్లించాలని అనేకసార్లు మంత్రిని, అధికారులను కలిసినా ఫలితం శూన్యమైంది. కాంగ్రెస్ తీసుకునే విధానపరమైన నిర్ణయాల మూలంగా పేదలకు వైద్యం దూరమవుతోంది. ప్రభుత్వాసుపత్రుల్లో సరైన వసతులు, పరికరాలు, మెడిసిన్ ఉండవనే నమ్మకాన్ని ప్రజల్లో కలిస్తున్నారు. చేతిలో చిల్లి గవ్వలేకుండా ఉచిత వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రి మెట్లేక్కే పేదవాడికి నిరాశే ఎదురుకానుంది. ఇప్పటికే పలురకాల పరికరాలు, మెడిసిన్ ప్రభుత్వాసుత్రుల్లో లేకపోవడం మూలానా రూ.వేలు ఖర్చుపెట్టి ప్రైవేట్‌లో చూయించుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి సప్లెయర్ల సమస్యను పరిష్కరించకుంటే మాత్రం కచ్చితంగా రాష్ట్రంలో పూర్తిస్థాయిలో వైద్యం ప్రైవేట్ పరమవుతుంది.

## దరఖాస్తుల ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ, మే 26: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2025-26 విద్యా సంవత్సరానికి రెగ్యులర్ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తెలుగు వర్సిటీ నిర్వహించే శిల్పం-చిత్రలేఖనం, డిజైన్, సంగీతం, రంగస్థలం, శాస్త్రీయ నృత్యం (కూచిపూడి, ఆంధ్రనాట్యం), జానపదం, తెలుగు, చరిత్ర-పర్యాటకం, భాషాశాస్త్రం, జర్నలిజం, జ్యోతిష్యం, యోగా కోర్సుల కొరకు ఎంఏ, డిగ్రీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రాంలలో అర్హత కలిగి ఆసక్తిగల విద్యార్థుల ప్రవేశం కోసం విశ్వవిద్యాలయం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం www.telugu university.ac.in, www. pstucet.org వెబ్‌సైట్‌లను సందర్శించాలని, పూర్తిచేసిన దరఖాస్తులను తేదీ 24-6-2025 లోగా సాధారణ రుసుముతో, తేదీ 30-6-2025 వరకు ఆలస్య రుసుముతో స్వీకరించడం జరుగుతుందని హనుమంతరావు తెలిపారు.

## కొలిక్కి వస్తున్న చెరువుల హద్దుల నిర్ధారణ

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల హద్దుల నిర్ధారణ ఎట్టకేలకు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. హైకోర్టు ఆదేశాలతో.. చెరువుల హద్దులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణ పనులపై హెచ్ఎండీఏ దృష్టి పెట్టింది. ఈ క్రమంలో నగరంలో చెరువుల పరిరక్షణలో కీలకమైన హద్దుల నిర్ధారణ వేగవంతం చేశారు. ఇప్పటివరకు 1,164 చెరువులకు తుది నోటిఫికేషన్ జారీకాగా, ఇంకా 1,773 చెరువులకు హద్దులను ఖరారు చేయాల్సి ఉంది. వీటిలో ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీచేసిన చెరువులను పునఃపరిశీలన చేయడంతోనే జాప్యం జరుగుతుందని హెచ్ఎండీఏ వర్గాలు చెబుతున్నాయి. అదే విధంగా క్షేత్రస్థాయిలో అందుబాటులో లేని రెవెన్యూ, ఇరిగేషన్ మ్యాపులతో కూడా సమస్యలు ఉత్పన్నం అవుతున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

# లీజు రద్దుచేయకుంటే ఆందోళన ఉధృతం

- బీఆర్ఎస్ విద్యార్థి విభాగం
- ఓయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేత



ఓయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

అడ్డగుట్ట, మే 26: ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ క్వార్టర్స్ లీజు అనుమతిని ఆదిధ్వని సొసైటీకి ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని.. వెంటనే సంబంధిత లీజును రద్దుచేయాలని కోరుతూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఓయూ రిజిస్ట్రార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ... ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ క్వార్టర్స్‌ని ఆదిధ్వని సంస్థ పేరుతో 30 సంవత్సరాలు లీజుకి ఇవ్వాలని యూనివర్సిటీ అధికారులు ఒప్పందం చేసుకున్నారని అన్నారు. జస్టిస్ చిన్నప్పరెడ్డి కమిషన్‌కి విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు యూనివర్సిటీ అధికారుల భూమిని కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. వర్సిటీ భూములు అన్యాక్రాంతం అవుతుంటే కాపాడాల్సింది పోయి ఉన్న భూములను నిబంధనలకు విరుద్ధంగా లీజుకు ఇవ్వడం ఏంటని వారు ప్రశ్నించారు. లీజు రద్దుచేయని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, నాయకులు.. ప్రశాంత్, మిథున్, నాగేంద్రరావు, అవినాష్, వినోద్, సతీష్ తదితరులు ఉన్నారు.

### ఉపసంహరించుకోవాలి

సికింద్రాబాద్, మే 26: ఓయూ ప్రొఫెసర్స్ క్వార్టర్స్‌ను 'ఆది ధ్వని' సంస్థ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని ఏబీవీపీ ఓయూ నాయకులు హెచ్చరించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రిజిస్ట్రార్‌కి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం యూనివర్సిటీ అధ్యక్షుడు ధృహన్ గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వి తేజ, జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజు,రాష్ట్ర కార్యసమితి సభ్యులు కమల్ సురేష్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

### లీజుతో నాకు సంబంధం లేదు

ఉస్మానియా యూనివర్సిటీలోని ప్రొఫెసర్స్ క్వార్టర్స్ లీజు వ్యవహారంతో తనకు సంబంధం లేదని మాజీ వీసీ రవీందర్ అన్నారు. తాను వీసీగా ఉన్నప్పుడు ఏ సంస్థకు గానీ, ట్రస్ట్‌కు గానీ లీజుకు ఇవ్వలేదన్నారు. దానకిషోర్ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడే పీ-3 క్వార్టర్స్‌ను లీజుకు ఇచ్చినట్లు ప్రస్తుతమున్న వీసీ కుమార్ చెప్పారని గుర్తుచేశారు. తన హయాంలో ప్రొఫెసర్ క్వార్టర్స్‌ను ఆది ధ్వని ట్రస్టుకు లీజుకిచ్చినట్లు మీడియాలో వస్తున్న కథనాలు పూర్తిగా అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. ఇకపై తనపై ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

# నక్కా దాస్ కన్నుమూత



- సీనియర్ నేతగా, సమాజ సేవకుడిగా గుర్తింపు
- మాజీ సీఎం కేసీఆర్‌తో 40 ఏండ్ల అనుబంధం
- నేడు పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు

ఖైరతాబాద్, మే 26: సీనియర్ నేత, సమాజ సేవకులు నక్కాదాస్ (77) కన్నుమూశారు. గత కొంతకాలంగా మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్న దాస్ సోమవారం సాయంత్రం ఒక్కకసారిగా అపస్మారక స్థితిలో ఇంట్లో కుప్పకూలారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేట్ చారిటీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య గీతాంజలి, కుమారుడు సంపత్, కుమార్తె స్రవంతి ఉన్నారు.

### మాజీ సీఎం కేసీఆర్‌తో సన్నిహిత్యం..

40 సంవత్సరాల క్రితం నక్కదాస్ సిద్దిపేట జిల్లా నారాయణపేట మండలం మల్యాల గ్రామంలో కుటుంబంతో నివాసం ఉండేవారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఆయనకు సన్నిహిత్య సంబంధాలు ఉండటమే కాకుండా ఆయనతో రాజకీయ వేదిక సైతం పంచుకున్నారు. మల్యాల గ్రామంతో సుదీర్ఘ అనుబంధం కలిగి ఉండటంతో మల్యాల నక్కదాస్‌గా అందరూ ఆప్యాయంగా పిలిచేవారు. 3 దశాబ్దాల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి గాంధీనగర్‌లో స్థిరపడిన తన తండ్రి మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ పాల్గొన్నారని సంపత్ పేర్కొన్నారు. నేడు పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని తెలిపారు.

# జూన్ 8,9న చేపప్రసాదం పంపిణీ



ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించిన డీసీపీ శిల్పవల్లి

సిటీబ్యూరో, మే 26(నమస్తే తెలంగాణ): నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో వచ్చేనెల 8,9తేదీల్లో చేపప్రసాదం పంపిణీకి సంబంధించి ఏర్పాట్లపై సోమవారం సెంట్రల్‌జోన్ డీసీపీ శిల్పవల్లి అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హైదరాబాద్ నగరానికి చెందిన 21 ప్రభుత్వశాఖలతో పాటు నిర్వహణ కమిటీబాధ్యులు, ఎన్‌జీఓలు, ఎగ్జిబిషన్‌సొసైటీ ప్రతినిధులు హాజరయ్యారు. గతంలో జరిగిన లోపాలను సరిదిద్దుకుంటూ ఈ సంవత్సరం పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా జరిపించడానికి అవసరమైన సూచనలను వివిధ శాఖల అధికారులు చేశారు. బందోబస్తుపై చర్చించారు.

# ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

### అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 62 విన్నపాలు వచ్చాయి. అలాగే జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 104 ఆర్జీలు వచ్చాయని.. ఆయా సమస్యలను త్వరగా పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్‌లు యాదగిరి రావు, అశోక్ సామ్రాట్, వేణుగోపాల్ రెడ్డి, అడిషనల్ సీసీపీలు గంగాధర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టరేట్‌లో 86 దరఖాస్తులు

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్లు ముకుంద రెడ్డి, కదిరవన్ పలనితో కలిసి ప్రజావాణి దరఖాస్తులను ఆయన స్వీకరించారు. మొత్తం 86 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఈ వెంకటాచారి, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, ఇంచార్జి ఏవో సునీత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ , డీడ బ్ల్యూఓ కోటాజీ, బీసీ వెల్ఫేర్ డీడీ ఆశన్న, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాస్ మహమ్మద్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రాజేందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్య

# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

### టీఎస్‌డీఎఫ్ కన్వీనర్ వినాయక రెడ్డి

చిక్కడపల్లి, మే 26: కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర డెమోక్రటిక్ ఫోరం (టీఎస్ డీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీఎస్‌డీఎఫ్ కన్వీనర్ వినాయక రెడ్డి, పీఓడబ్ల్యు అధ్యక్షురాలు సంధ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలనే డిమాండ్‌తో ఈనెల 29న బషీబాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నమన్నారు. ఈ సదస్సుకు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, సీపీఐ నాయకుడు నర్సింహ, సీపీఐ(ఎంఎల్) నాయకుడు చలపతిరావు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇండియన్ నేషనలిస్టు మూమెంట్ పార్టీ నాయకుడు కృష్ణ ప్రసాద్, హనుమేష్,ఆర్ఎస్పీ నాయకుడు జానకి రాములు, గోవర్ధన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా ప్రజావాణికి 64 ఫిర్యాదులు




సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): ఒకప్పుడు నగరశివార్లుగా ఉన్న భూముల్లో వేసిన పంచాయతీ లేఔట్లకు రక్షణ లేకుండా పోయిందంటూ పలు ప్రాంతాలకు చెందిన స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 64 ఫిర్యాదులు రాగా.. అందులో 60 ఫిర్యాదులు పాత లేఔట్లకు సంబంధించినవే ఉన్నాయి. ఫిర్యాదులను నేరుగా స్వీకరించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ గూగుల్ మ్యాప్స్ ద్వారా వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలను అప్పగించారు. అలాగే క్షేత్రస్థాయిలో పరిశీలనకు సమయమిచ్చారు. అధికారికంగా రివైజ్ చేయని పక్షంలో పాత లేఔట్ ప్రకారమే రహదారులు, పార్కులుంటాయని కమిషనర్ స్పష్టం చేశారు. ఫిర్యాదులను పరిశీలించి ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత చర్యలుంటాయని రంగనాథ్ తెలిపారు.

# 18 మంది దివ్యాంగులకు ఉద్యోగాలు

### జిల్లా కలెక్టర్ అనుదీప్

సిటీ బ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): అర్హులైన దివ్యాంగ అభ్యర్థులకు ఉద్యోగ నియామాక పత్రాలు అందించామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. దివ్యాంగులకు కేటాయించిన 37 బ్యాక్‌లాగ్ పోస్టులను అర్హత కలిగిన 18 మందికి వివిధ కేటగిరీల్లో నియామక పత్రాలు అందించామని పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలకు 2018-19లో నోటిఫికేషన్ విడుదల కాగా వివిధ కారణాలతో నియామక ప్రక్రియ పూర్తికాలేదని చెప్పారు. 37 ఉద్యోగాల్లో ప్రస్తుతం 18 ఖాళీలను గుర్తించి అర్హులైన వివిధ వర్గాల దివ్యాంగ అభ్యర్థులను ఎంపిక చేశామని కలెక్టర్ తెలిపారు.



దివ్యాంగురాలికి నియామకపత్రం అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్

### సర్వేయర్ల శిక్షణ ప్రారంభం

భూభారతి అమలులో సర్వేయర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు లైసెన్సడ్ సర్వేయర్స్ ట్రైనింగ్ సెంటర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వే శిక్షణ పొందేందుకు ఐటీఐ, సివిల్ ఇంజినీరింగ్ చేసిన నిరుద్యోగులైన హైదరాబాద్ జిల్లాకు చెందిన 76 మంది యువకులు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. వీరందరికీ అనుభవజ్ఞులతో 50 రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జీ ముకుందరెడ్డి, జిల్లా సర్వే అధికారి వీ శ్రీరామ్, ఇన్‌స్పెక్టర్ అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఫతేనగర్ ఆర్వోబీ

- ప్రమాదాలబారిన పడుతున్న ప్రజలు
- మరమ్మతులు పట్టించుకోని సర్కార్

బాలానగర్, మే 26: ఫతేనగర్ ఫ్లైఓవర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. శిథిలావస్థలో ఉన్న ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి)కు అధికారులు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఆర్వోబీకి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టడంతో పాటు ప్రస్తుతం ఉన్న ఆర్వోబీ పక్కనే మరో వంతెన నిర్మాణానికి అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శంకుస్థాపన కూడా చేశారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్వోబీని పట్టించుకోకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఇద్దరు వ్యక్తులు ఆర్వోబీ పైనుంచి మెట్లమార్గం ద్వారా కిందకు దిగుతూ ఉండగా పెచ్చులూడి ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. ప్రభుత్వం ఫతేనగర్ వంతెనకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### మరమ్మతులు చేయించాలి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫతేనగర్ ఆర్వోబీకి పలుమార్లు మరమ్మతులు చేపట్టాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్వోబీని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రజల ఇబ్బందులను గమనించి తక్షణమే మరమ్మత్తులు చేయించాలి.



వంతెన పెచ్చులూడడంతో గాయపడిన పాదచారి




ఫతేనగర్ ఆర్వోబీ

## కళలపట్ల యువతలో ఆసక్తి పెరుగుతోంది

### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సంగారెడ్డి, మే 26(నమస్తే తెలంగాణ): యువతలో భారతీయ కళల పట్ల ఆసక్తి పెరుగుతుండటం శుభ పరిణామమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ ఆండ్ కల్చర్ అమాంగ్స్ యూత్ (స్పిక్‌మాకే)10 అంతర్జాతీయ సమ్మేళనంను గవర్నర్ ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐఐటీ డైరక్టర్ బీఎస్ మూర్తి, స్పిక్‌మాకే వ్యవస్థాపకులు డా.కిరణ్ సేథ్, స్పిక్‌మాకే ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆటోలోనే చెత్త వేయాలి

### మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): నగర ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి కోరారు. సోమవారం బంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీనగర్‌లో ప్రీ మాన్‌సూన్ శానిటేషన్ డ్రైవ్‌ను మేయర్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఇంటిలో ఉన్న చెత్తను తప్పని సరిగా స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని, ఓపెన్ ప్రదేశాల్లో వేయకూడదన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలు కూడా రోడ్డుపై వేయవద్దని, జీహెచ్ఎంసీ సీఅండ్‌డీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ వారికి ఫోన్‌చేస్తే వారే తీసుకొని పోతారని, బయట వేయడం మూలంగా ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంటుందని మేయర్ తెలిపారు. ప్రీ శానిటేషన్ డ్రైవ్‌లో బంజారాహిల్స్ మూడు నుంచి 5 రోజుల్లో క్లీన్ చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రేటర్‌లో ఉన్న150 వార్డులను క్లీన్ చేయడం జరుగుతుందని అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ పేర్కొన్నారు.



మాన్‌సూన్ శానిటేషన్ ఆటోలను ప్రారంభిస్తున్న మేమర్

ఈ సారి వర్షాలు ముందుగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు, ఫాగింగ్, లాంటి చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి అన్నారు.వర్షాకాలంలో పబ్లిక్ సేఫ్టీ వర్కర్ సేఫ్టీ ప్రాధాన్యనివ్వడం జరిగిందని జలమండలి జీఎం హరిశంకర్ తెలిపారు. వాటర్ లాగింగ్ ఏరియాలో రెడ్ కలర్లో ఉన్న మ్యాన్‌హోల్స్ ప్రజలు ఓపెన్ చేయవద్దన్నారు. జీహెచ్ఎంసీ చేసే ప్రతి కార్యక్రమానికి జలమండలి పూర్తి సహకారం అందిస్తుందని హరిశంకర్ తెలిపారు.

# ప్రతి జిల్లాలో నీరాకేఫ్ ఏర్పాటుచేయాలి

### గౌడ ఐక్య సాధన సమితి



మాట్లాడుతున్న నారాయణ గౌడ్

చిక్కడపల్లి, మే 26: రాష్ట్రంలో గీత కార్పొరేషన్ ద్వారానే నీరా కేఫ్‌లను నిర్వహించాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ గౌడ్ మాట్లాడుతూ.. ఆగస్టు 18వ తేదీలోపు జనగామ జిల్లా పేరును పాపన్న జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న గీతన్నల నష్టపరిహారం, కొత్త పెన్షన్లు ఇవ్వాలన్నారు. ఉత్తర తెలంగాణలో గీత వృత్తిదారులపై జరుగుతున్న వీడీసీల దాడులను అరికట్టాలని అన్నారు. ప్రతి జిల్లాలో నీరా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోపాటు.. చనిపోయిన గీత కార్మికుడికి 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు నక్క కృష్ణ గౌడ్, సర్వాయి పాపన్న మోకు దెబ్బ అధ్యక్షుడు జక్క వీరస్వామి, పటేల్ వెంకటేశ్ గౌడ్, జైగౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బురా మల్సూర్, సోషల్ డెమోక్రటిక్ జాతీయ అధ్యక్షుడు కోల జనార్ధన్, శ్రీకాంత్ గౌడ్, కూరెల్ల వేములయ్య, బొనగాని యాదగిరిగౌడ్, ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, పరశురాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.